క్లుప్తంగా

రేపటి నుంచి కుంభాభిషేక వేడుకలు

తుగ్గలి: మండల పరిధిలోని ఆర్.కొత్తూరులో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయ కుంభాభిషేక ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ నెల 15న గణపతి పూజ, అభిషేకాలు, దీక్షాహోమం, 16న నవగ్రహ దేవతలు, నాభిశిల, నాగదేవత విగ్రహ ప్రతిష్ఠ, 17న ఉదయం బాలాంజనేయస్వామి, పంచముఖి ఆంజనేయస్వామి విగ్రహ, శిఖర కలశ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

గడువు పొడిగింపు

మద్దికెర: కస్తూర్బా విద్యాలయంలో ఇంటర్మీడియెట్ ప్రవేశానికి ఈనెల 20వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రత్యేక అధికారి జ్యోతి శనివారం తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నీటి పొదుపు అందరి బాధ్యత



ఎల్లెల్సీలో నీటిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) ద్వారా వస్తున్న నీరు ఆగిపోయిన నేపథ్యంలో పట్టణ ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. శనివారం ఎల్లెల్సీలో ఇన్‌ఫ్లో ఆగిపోవడంతో డీఈ మనోహర్‌రెడ్డి, ఏఈ శరత్ చంద్రతో కలిసి ఎల్లెల్సీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్లెల్సీ ద్వారా వచ్చిన నీటిని ఎస్ఎస్ ట్యాంక్‌లో తాగునీటి అవసరాల కోసం నిల్వచేసినట్లు తెలిపారు. ఉన్న నీటిని పొదుపుగా వాడుకుంటే కొళాయిల ద్వారా మరిన్ని రోజులు సరఫరా చేసే అవకాశం ఉందన్నారు. నీటి పొదుపును అందరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు.

నేడు దేవనకొండలో ఎన్నికల ప్రచారం

దేవనకొండ: వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బూసినే విరూపాక్షి ఆదివారం దేవనకొండ మండలం పొట్లపాడు, కొత్తపేట, పుల్లాపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఆ పార్టీ నాయకులు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

గడ్డివామి దగ్ధం



కాలిపోతున్న గడ్డివామి

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పుచ్చకాయలమాడ గ్రామంలో గొర్ల కాశినాథ్ అనే రైతు పశువుల మేత కోసం వేసుకున్న గడ్డివామి శనివారం దగ్ధమైంది. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో గమనించిన స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న సిబ్బంది మంటలు ఆర్పివేశారు. అప్పటికే వామి కాలి బూడిదైంది. రూ. 60 వేలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు.

బాల్య వివాహం చటరీత్యానేరం



నోటీసు అందజేస్తున్న పోలీసులు

మద్దికెర: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని.. ఎవరైనా చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ రమేష్‌బాబు హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని హంప గ్రామంలో బాల్యవివాహం చేస్తున్నారని తెలుసుకుని అమ్మాయి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. యుక్తవయసు రాకముందే ఆడపిల్లలకు పెళ్లి చేస్తే జరిగే అనార్థాల గురించి అవగాహన కల్పించి నోటీసు అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి, ఉపసర్పంచ్ తిమ్మప్ప ఉన్నారు.

ఓటరు నమోదుకు రేపే ఆఖరు

కృష్ణగిరి: ఓటరు నమోదుకు ఈ నెల 15వ తేదీ ఆఖరు అని తహసీల్దార్ అనురాధ తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. ఈ రెండు రోజులు ఆయా గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో బీఎల్ఓలు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

చివరి అవకాశం

చిప్పగిరి: ఓటరు నమోదుకు ఈ నెల 15 వరకే అవకాశం అని తహసీల్దార్ పద్మజ అన్నారు. ఫామ్ 6 ద్వారా ఓటు నమోదు చేసకోవచ్చన్నారు. మండలంలో ఇప్పటి వరకు పురుష ఓటర్లు 12,187 మంది, మహిళా ఓటర్లు 12,208, ఇతరులు ఐదుగురు సహా మొత్తం 24,400 ఓటర్లు ఉన్నారని తెలిపారు.

పేదల సంక్షేమమే జగనన్న లక్ష్యం

- మరోసారి సంక్షేమ ప్రభుత్వాన్ని తెచ్చుకుందాం
- వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక



ఎమ్మిగనూరు 33వ వార్డులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక

ఎమ్మిగనూరుటౌన్: పేదల ఆర్థికాభివృద్ధికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని.. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి మరోసారి సంక్షేమ పాలనను తెచ్చుకుందామని వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక అన్నారు. శనివారం పట్టణంలోని 33వ వార్డులో ఇంటింటి ప్రచారం చేశారు. మహిళలు, వృద్ధులను పలకరిస్తూ వారి యోగక్షేమాలు, సమస్యలు తెలుసుకున్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఐదేళ్ల పాలనలో ప్రజాసంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం జగనన్న పరిపాలన చేశారని తెలిపారు. అవినీతికి తావులేకుండా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు నేరుగా బ్యాంక్ ఖాతాలకే జమ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదే అన్నారు.

టీడీపీ ఉత్తుత్తి హామీలను నమ్మి మోసపోవద్దు

సార్వత్రిక ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని టీడీపీ నాయకులు ఉత్తుత్తి హామీలతో ఓటర్లను మభ్యపెట్టేందుకు ప్రజల్లోకి వస్తున్నారని.. వారిని నమ్మవద్దని కోరారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏ వర్గం బాగుపడలేదని తెలిపారు. గతంలో ఇచ్చిన హామీలనే విస్మరించారని.. ఇప్పుడు ఇస్తున్న హామీలను ఎలా నమ్ముతారని అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు దూరం అవుతాయన్నారు. ఆ పార్టీ వారు చెప్పే కల్లబొల్లి మాటలు విని మోసపోవద్దని సూచించారు. ఈ ఎన్నికల్లో టీడీపీకి తగిన గుణపాఠం చెప్పాలని.. సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగనన్నకు మరోసారి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. మే 13వ తేదీ జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీగా బీవై రామయ్య, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కుర్ణికరికల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బుట్టా శారదమ్మ, శాప్ నెట్‌వర్క్ చైర్మన్ మాచాని వెంకటేష్, జిల్లా వక్ఫ్‌బోర్డ్ ఉపాధ్యక్షుడు రియాజ్‌అహ్మద్, మున్సిపల్ కౌన్సిలర్లు నీలకంఠ, ఇషాక్, రాజరత్నం, సుధాకర్, కోటకొండ నరసింహులు, విశ్వనాథ్ రమేష్, వినయ్, ప్రతాప్‌రెడ్డి, వీరేష్, భీమేష్, బసన్న, రజాక్, సయ్యద్ చాంద్ తదితరులు పాల్గొన్నారు.



సత్యనారాయణమ్మను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రభుత్వ మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లండి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ

హొళగుంద: ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు సత్య నారాయణమ్మ అన్నారు. శనివారం ఆ పార్టీ నేత గడ్డం రామకృష్ణతో కలిసి హొళగుందకు వచ్చిన ఆమెను పార్టీ మండల కన్వీనర్ షఫివుల్లా నివాసంలో నాయకులు ఎస్కే గిరి, రవి, మహేశ్, ఆసీఫ్ తదితరులతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సత్యనారాయణమ్మ మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ఐదేళ్లలో అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించి వైఎస్సార్‌సీపీ, టీడీపీ పాలన మధ్య ఉన్న తేడాను వివరించాలని సూచించారు. ప్రతి గ్రామంలో పాఠశాలలు, ఆస్పత్రులు, సచివాలయాలు, సీసీరోడ్లు ఇలా జరిగిన ప్రతి అభివృద్ధిని, సంక్షేమ పథకాలను ప్రజలకు చెప్పాలన్నారు. ఆలూరు నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న బుసినే విరుపాక్షిని గెలిపించుకుని జగనన్నకు కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు.

జెండామోసే ప్రతి కార్యకర్త స్టార్ క్యాంపెయినరే



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య

దేవనకొండ: జెండా మోసే ప్రతి కార్యకర్త వైఎస్సార్‌సీపీ స్టార్ క్యాంపెయినరేనని కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, పార్టీ జిల్లా జేసీఎస్ కోఆర్డినేటర్ తెర్నెకల్ సురేందర్‌రెడ్డి అన్నారు. శనివారం తెర్నెకల్ గ్రామంలో పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చంద్రబాబునాయుడు సినీ స్టార్ క్యాంపెయినర్‌లను పెట్టుకునే వారికి భారీ మొత్తంలో డబ్బులు అందించి ప్రచారం చేసుకుంటున్నాడని తెలిపారు. వైఎస్సార్‌సీపీకి జెండా మోసే ప్రతి కార్యకర్త స్టార్ క్యాంపెయినరేనని అన్నారు. ఈ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిచి ఆలూరు అంటే వైఎస్సార్‌సీపీకి కంచుకోట అని మరోసారి నిరూపిస్తామన్నారు. చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలన్నీ బూటకమని, ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజల మద్దతుతో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు.

ఎమ్మిగనూరుకు చేరిన ఈవీఎంలు



స్ట్రాంగ్ రూమ్ వద్ద పోలీసుల పహారా



స్ట్రాంగ్ రూంలో భద్రపరుస్తున్న ఆర్ఓ

ఎమ్మిగనూరుటౌన్: వచ్చే నెల 13వ తేదీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు ఈవీఎంలు శనివారం పట్టణానికి చేరుకున్నాయి. భారీ పోలీసు బందోబస్తు మధ్య వాటిని స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో భద్రపరిచారు. 327 బ్యాలెట్ యూనిట్లు, 327 కంట్రోల్ యూనిట్లు, 355 వీవీ ప్యాట్లు జిల్లా కేంద్రం నుంచి వచ్చినట్లు ఎన్నికల అధికారి, తహసీల్దార్ శేషారెడ్డి, డీటీ రఘువీర తెలిపారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పోలీసు పహారా ఉంచారు.

ఆలూరుకు చేరిన ఈవీఎంలు

ఆలూరు: ఎన్నికల నిర్వహణ కోసం నియోజకవర్గానికి కేటాయించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎంలు) శనివారం పోలీసు బందోబస్తు మధ్య ఆలూరుకు చేరుకున్నాయి. రాజకీయ పార్టీలకు చెందిన నాయకుల సమక్షంలో నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.రామునాయక్, తహసీల్దార్ చంద్రశేఖరయ్య, ఆలూరు సీఐ బి.వెంకటేశ్వర్లు వాటిని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచారు. మొత్తం 353 బ్యాలెట్ యూనిట్లు, 353 కంట్రోల్ యూనిట్లు, 382 వీవీ ప్యాట్లు వచ్చినట్లు ఆర్ఓ తెలిపారు. స్ట్రాంగ్ రూంల వద్ద సీసీ కెమెరాలు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట



వివాహం చేసుకున్న ప్రభుత్వ ఉద్యోగులు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి సచివాలయం–3లో విధులు నిర్వహిస్తున్న వెల్దుర్తి పట్టణానికి చెందిన మాదిగ చంద్రనారాయణ (జేఎల్ఎమ్), డోన్‌లో నివాసముంటున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్ స్రవంతి శుక్రవారం ప్రేమ వివాహం చేసుకున్నారు. శనివారం స్రవంతి తమ్ముడు, తల్లి, మరికొందరు వెల్దుర్తికి వచ్చి చంద్రనారాయణ ఇంటి వద్ద గొడవ చేశారు. దీంతో తమకు రక్షణ కల్పించాలని ఈ జంట కర్నూలు పోలీసు ఉన్నతాధికారులను ఆశ్రయించింది.

విరూపాక్షిని భారీ మెజారిటీతో గెలిపించుకుందాం



మద్దతుదారులతో వైకుంఠం మల్లికార్జునచౌదరి

ఆలూరు: ఆలూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షిని భారీ మెజారిటీతో గెలిపించుకుందామని వైకుంఠం మల్లికార్జున చౌదరి అన్నారు. శనివారం మండలంలోని ములుగుందం, కైరుప్పల గ్రామాల్లోని మద్దతుదారులతో మాట్లాడారు. 40 ఏళ్ల పాటు టీడీపీ కోసం ఎంత కష్టపడినా తగిన గుర్తింపు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీని నమ్ముకున్న తనను కాదని అంటీముట్టనట్లు వ్యవహరించే వారికే సీటు కట్టబెట్టారని తెలిపారు. అందుకే పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు చెప్పారు. నియోజకవర్గంలో టీడీపీని జీరో చేస్తానన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విరూపాక్షిని భారీ మెజారిటీతో గెలిపించుకుందామన్నారు. ఇద్దరిది చిప్పగిరి గ్రామం అని.. విరుపాక్షి కుటుంబం తనకు చిన్నతనం నుంచి బాగా తెలుసన్నారు.

రత్నపల్లెలో ఇరువర్గాల ఘర్షణ

- 10 మందికిపైగా గాయాలు
- 31 మందిపై కేసు





గాయపడిన వారు

వెల్దుర్తి(కృష్ణగిరి): పాత కక్షలతో రత్నపల్లె గ్రామంలో ఇరువర్గాల మధ్య శనివారం ఉదయం ఘర్షణ చోటుచేసుకుంది. ఇరువర్గాలు దాడులు చేసుకోవడంతో 10మందికిపైగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వెల్దుర్తి సీహెచ్‌సీకి తరలించారు. పలువురికి మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో నడిపి సోమన్న కోమాలో ఉండగా, సుధాకర్, రాములమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కృష్ణ, రమేశ్, విజయరాజు, కర్రెన్న, చిన్నయ్య, లక్ష్మీదేవి, సంతోషి, ఎల్లకృష్ణ, లక్ష్మణరావు, ఎల్లస్వామి చికిత్స పొందుతున్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు 31 మందిపై కేసులు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ సురేశ్‌కుమార్ రెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. గ్రామంలో అందరూ సంయవనం పాటించాలని కోరారు. పట్టింపులకు పోవొద్దని హితవుపలికారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు



విరూపాక్షి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన గూళ్యం గ్రామస్తులు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న బుట్టా ప్రతుల్

ఆలూరు రూరల్: జగనన్న ప్రభుత్వంలో అన్ని పథకాల ద్వారా లబ్ధి పొందాం.. మేమంతా ఎప్పటికీ మీ వెంటే ఉంటాం.. మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నాం.. అంటూ హాలహర్వి మండలం గూళ్యం గ్రామానికి చెందిన కావలి సామాజికవర్గానికి చెందిన వారు ముక్తకంఠంతో చెప్పారు. శనివారం ఉదయం చిప్పగిరిలోని ఆలూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి నివాసంలో గూళ్యం గ్రామంలోని టీడీపీకి చెందిన కరి మల్లప్ప, రాజశేఖర్, రంగయ్య, సోమయ్య, గురుపాదయ్య, సీతప్ప, గిడ్డయ్య,నాగరాజు, మారెప్ప, ఉచ్చీరప్ప, పంపాపతి, నాగరాజు, కళాదాసు, సోమలింగలతో పాటు 50 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి విరూపాక్షి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా విరుపాక్షి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే బీసీలకు సముచిత స్థానం లభించిందన్నారు. రాష్ట్రంలో బీసీలకు రాజకీయంగా, సామాజికంగా పెద్దపీట వేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. టీడీపీ నేతలు ప్రలోభాలకు గురిచేస్తున్నారని.. వారిని నమ్మవద్దని చెప్పారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

నందవరం: మండల పరిధిలోని జోహరాపురం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఆ పార్టీ నేత బుట్టా ప్రతుల్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. టీడీపీ నాయకులు వై.నాగిశేషరెడ్డి, వై. సంజీవరెడ్డి, వై. హనుమంతరెడ్డి, వై. బాల నాగిరెడ్డి, నాగిరెడ్డి, రాఘవరెడ్డితో పాటు 20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక, ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య గెలుపునకు కృషి చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నిఖిల్ చక్రవర్తి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు విరుపాక్షిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, సర్పంచ్ శివన్న, ఎంపీటీసీ సభ్యుడు విజయమోహన్‌రెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, రంగారెడ్డి, నాగరాజు, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో కంగాటి రామ్మోహన్‌రెడ్డి

గుంటుపల్లె టీడీపీ నాయకులు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండలం గుంటుపల్లెకు చెందిన టీడీపీ నాయకులు వడ్డె గోగుల నడిపి సుంకన్న, మాల మద్దయ్య శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తనయుడు కంగాటి రామ్మోహన్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. నాయకులు రమణారెడ్డి, వెంకటేశం, రామకృష్ణ, నాగేంద్ర పాల్గొన్నారు.

రేపు గంజిహళ్లిలో ఉరుసు

గోనెగండ్ల: గంజిహళ్లి గ్రామంలోని బడేసాహెబ్ తాత ఉరుసు సోమవారం జరగనున్నట్లు దర్గా ధర్మకర్త కుబేర్‌రెడ్డి, పీఠాధిపతులు శనివారం తెలిపారు. అదే రోజు ఉదయం రాష్ట్ర స్థాయి పాలపండ్ల ఎద్దుల బండ లాగుడు పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల వారు 8374803596, 8985999786 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రజా సేవకుడికి పట్టం కట్టండి



జోహరాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బుట్టా ప్రతుల్

నందవరం: సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి పట్టం కట్టాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు బుట్టా ప్రతుల్ కోరారు. శనివారం మండల పరిధిలోని జోహరాపురం, గంగవరం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పేదల సంక్షేమం కొనసాగాలన్నా, పేదల జీవన ప్రమాణాలు మెరుగు పడాలన్నా మరోసారి సీఎం జగనన్నను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు నిఖిల్ చక్రవర్తి, పార్టీ మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, నాయకులు విరూపాక్షిరెడ్డి, సర్పంచ్ బైటిగేరి శివన్న, ఎంపీటీసీ విజయమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ

కనకవీడు గ్రామంలో అనారోగ్యంతో సతీష్ కుమార్, శైలజ దంపతుల కుమారుడు శ్యామ్‌కుమార్(8 నెలలు) శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బుట్టా ప్రతుల్ బాలుడి మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రమణీయం.. వీరభద్రుని రథోత్సవం



అశేష జనవాహిని మధ్య కదులుతున్న రథం



స్వామివారి రథాన్ని లాగుతున్న భక్తులు

తుగ్గలి: మండల పరిధిలోని ఎద్దులదొడ్డిలో వీరభద్రేశ్వస్వామి రథోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భద్రకాళి సమేత వీరభద్రేశ్వరస్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం పూలతో అలంకరించిన రథంలో స్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య భక్తులు రథాన్ని లాగారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయ్, మాజీ సర్పంచ్ వీరేష్, గ్రామ పెద్దలు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా రథోత్సవం

ఆస్పరి: మండలంలోని కైరుప్పల గ్రామంలో వీరభద్రస్వామి రథోత్సవం కనుల పండువగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల జయజయ ధ్వానాలు, మేళతాళాల నడుమ రథాన్ని బసవన్న దేవాలయం వరకు లాగారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అంతకు ముందు రథానికి వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీవై రామయ్య, బుసినె విరూపాక్షి, సురేంద్రరెడ్డి పూజలు చేశారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం



నందవరం గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ సీతారామయ్య

నందవరం: ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య అన్నారు. శనివారం మండలంలోని నందవరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళి పాటించాలని సూచించారు. ఎవరైనా అల్లర్లు సృష్టించినా, ప్రేరేపించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రలోభాలకు లోనుకాకుండా నచ్చిన అభ్యర్థికి స్వేచ్ఛగా ఓటు వేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలపాలు, అల్లర్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకారించాలని కోరారు. సీఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐ తిమ్మయ్య పాల్గొన్నారు.

ఎల్లెల్సీలో నిలిచిపోయిన నీటి ప్రవాహం

- టీబీ డ్యాంలో నీటి నిల్వ 3.993 టీఎంసీలే



హొళగుంద సెక్షన్ ఎల్లెల్సీలో నిలిచిన ప్రవాహం

హొళగుంద: తుంగభద్ర దిగువ (ఎల్లెల్సీ) కాలువ హొళగుంద సెక్షన్‌లో నీటి ప్రవాహం నిలిచిపోయింది. వేసవి కావడం, టీబీ డ్యాంలో నీటి మట్టం అడుగంటుతుండడంతో బోర్డు అధికారులు తాగునీటి అవసరాల కోసం ఎల్లెల్సీకి ఈ నెల 11న నీటిని నిలిపివేసిన సంగతి తెలిసిందే. రెండు రోజుల పాటు పారిన నీరు శనివారం హొళగుంద వద్ద పూర్తిగా ఆగిపోయింది. నాలుగేళ్లుగా సమృద్ధిగా వర్షాలు కురవడంతో తుంగభద్ర జలాశయానికి పూర్తి స్థాయిలో నీరు చేరి దిగువ కాలువ(ఎల్లెల్సీ) కింద రెండు కార్ల పంటలు పండించిన రైతులు ఈ ఏడాది ఒకే పంటతో సరి పుచ్చుకున్నారు. కాలువకు నీరు బంద్ కావడంతో గ్రామాల్లో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇక టీబీ డ్యాంలో శనివారం ఉదయం 1633 అడుగులకు గాను 1578.98 అడుగులకు నీరు చేరింది. 105.788 టీఎంసీలకు గాను ప్రస్తుతం కేవలం 3.993 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఔట్ ఫ్లో 112 క్యూసెక్కులుంది.